యూనిట్ III

# 7. సూక్తిసుధ

**ఆలోచించండి-మాట్లాడండి**




ప్రశ్నలు:

1. చిత్రంలో ఎవరెవరున్నారు?
2. ఉపాధ్యాయురాలు ఏం చెపుతుండవచ్చు? ఊహించండి.
3. మీకు తెలిసిన సూక్తులు చెప్పండి.
4. ఇలాంటి మరికొన్ని మంచి మాటలను పాఠం ద్వారా తెలుసుకుందాం!

**ఉద్దేశం:** విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఈ పాఠం ఉద్దేశం.

ఈ పాఠంలో ఉండే అన్ని పద్యాలను కంఠస్థం చేయండి.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాల కింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గుర్తించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'అర్థాల పట్టిక' చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.





❋ కం॥ ఏరకుమీ కసుగాయల
దూరకుమీ బంధుజనుల దోషము సుమ్మీ
పారకుమీ రణమందున
మీరకుమీ గురువులాజ్ఞ మేదిని సుమతీ!
– బద్దెన



❋ ఆ.వె. నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు
తళుకు బెళుకు రాళ్ళు తట్టెడేల?
చదువ పద్యమరయ చాలదా ఒక్కటి
విశ్వదాభిరామ వినురవేమ!
– వేమన

❋ కు॥ చేయకుము కాని కార్యము
పాయకుము మతిన్ శుభం బవని భోజనమున్
చేయకుము రిపు గృహంబున
గూయకు మొరుమనసు నొచ్చుకూత కుమారా!
– పక్కి అప్పలనరసయ్య



❋ ఆ.వె. కష్టసాధ్యమైన కార్యమ్ము నెరవేర్ప
నైకమత్యమే మహాబలమ్ము
పావురములు వలను పైకెత్తుకొని పోవె
లలిత సుగుణజాల తెలుగు బాల!
– కరుణశ్రీ

❋ కు॥ ఆపదలకోర్చి సంపద
నా పయి భోగింపు మనెడి హర్షోక్తుల నీ
లోపలఁ దలంచుచు లాంతరు
దీపము చందమున వెలుగ దివురు కుమారీ!
– పక్కి అప్పలనరసయ్య



©SCERT not to be republished

❋ శా॥ జాతుల్సెప్పుట, సేవజేయుట, మృషల్ సంధించుట న్నా యప
ఖ్యాతిం బొందుట, కొండెగాడవుట, హింసారంభకుండౌట, మి
థ్యా తాత్పర్యము లాడు టన్నియు పరద్రవ్యంబు నాశించి యా
శ్రీ తానెన్ని యుగంబు లుండగలదో శ్రీకాళహస్తీశ్వరా!
– ధూర్జటి

**కవుల పరిచయాలు:**

| | కవి | కాలం | రచనలు |
|---|---|---|---|
| 1. | బద్దెన | 13వ శతాబ్దం | సుమతి శతకం |
| 2. | పక్కి అప్పల నరసయ్య | 16వ శతాబ్దం | కుమార, కుమారీ శతకాలు |
| 3. | ధూర్జటి | 16వ శతాబ్దం | 1. శ్రీకాళహస్తీశ్వర శతకం<br>2. శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం |
| 4. | వేమన | 17వ శతాబ్దం | వేమన శతకం |
| 5. | కరుణ శ్రీ (జంధ్యాల పాపయ్య శాస్త్రి) | 1912-1992 | తెలుగుబాల శతకం, ఉదయశ్రీ, కరుశ్రీ, విజయశ్రీ |

**భావములు**

1. లేత కాయలను కోయగూడదు. చుట్టాలను నిందించగూడదు. యుద్ధంలో పిరికివాడిలా వెన్ను చూపి పారిపోగూడదు. గురువుల ఆజ్ఞను అతిక్రమించగూడదు.
2. తళతళ మెరిసే తట్టెడు రాళ్ళకన్నా శ్రేష్ఠమైన నీలమణి ఒక్కటి చాలు. అలాగే మంచి నీతిబోధచేసే పద్యం ఒకటి చాలు.
3. చెడ్డపనులు చేయవద్దు. మంచి పనులను విడవవద్దు. శత్రువుల ఇంటిలో భోజనం చేయవద్దు. ఇతరుల మనసుకు బాధ కలిగేటట్లు మాట్లాడవద్దు.
4. సుకుమారమైన, చక్కటి గుణాలున్న తెలుగు బాలా! చాలా కష్టమైన పని చేయాలంటే ఎంతో బలం కావాలి. ఐకమత్యంగా ఉంటే అలాంటి బలాన్ని పొందవచ్చు. పావురాలన్నీ కలిసి వేటగాడు పన్నిన వలనే పైకి ఎత్తుకొనిపోయాయి కదా!
5. "కష్టాలను ఎదుర్కొని ఆ తర్వాత సుఖపడాలి" అనే పెద్దల మాటలను గుర్తుచేసుకో! లాంతరు లోపల నిశ్చలంగా ఉన్న దీపంలా స్థిరంగా ఉండడానికి ప్రయత్నించు.
6. ఓ శ్రీకాళహస్తీశ్వరా! మానవులు ఇతరుల ధనాన్ని ఆశించి వంశపు గొప్పతనాన్ని చెప్పుకోవడం, సేవలు చేయడం, అబద్ధాలాడడం, అన్యాయాలకు పూనుకోవడం, చాడీలు చెప్పడం, ఇతరులను హింసించడం ఉన్నది లేనట్లు నమ్మబలకడం చేస్తున్నారు. ఇట్లా సంపాదించిన ధనం అతని దగ్గర ఎన్ని యుగాలపాటు ఉంటుంది? (ఉండదని తాత్పర్యం).



## ఇవి చేయండి

### I. వినడం-మాట్లాడడం



1. పాఠంలోని పద్యాలు వేటిని బోధిస్తున్నాయి?
2. పాఠంలో నీకు ఏ పద్యాలు నచ్చాయి? ఎందుకు?
3. పాఠంలోని పద్యాలను భావయుక్తంగా చెప్పండి. రాగయుక్తంగా పాడండి.
4. ఈ పాఠంలోని పద్యాల్లో ఏయే విషయాలను ప్రస్తావించారు?

### II. చదవడం, అవగాహన చేసుకోవడం




1. కింది భావాలను తెలిపే పద్యపాదాలు పాఠంలో గుర్తించి రాయండి.

అ) గురువుల ఆజ్ఞను అతిక్రమించవద్దు.
________________


ఆ) పావురాలన్నీ కలిసి వలను ఎత్తుకొనిపోయాయి.
________________

ఇ) లాంతరులోని దీపంలా చలించకుండా ఉండాలి.
________________

ఈ) సంపాదించిన ధనం ఎన్నియుగాలు ఉంటుంది?
________________



2. కింది పద్యాన్ని చదివి ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి.



అన్ని దానములను నన్నదానమె గొప్ప
కన్నతల్లి కంటె ఘనము లేదు
ఎన్న గురుని కన్న నెక్కుడు లేదయా
విశ్వదాభిరామ వినురవేమ!

ప్రశ్నలు:

అ) అన్ని దానాల కన్నా గొప్ప దానం ఏది?
________________

ఆ) ఈ భూమి మీద ప్రతి వ్యక్తీ, ఎవరిని గొప్పగా భావిస్తాడు?
________________

ఇ) గురువు ఎందుకు గొప్పవాడు?


______________________

ఈ) ఈ పద్యాన్ని రాసినవారు ఎవరు?

______________________

### 3. పాఠం ఆధారంగా జవాబులు రాయండి.

అ) ఎవరి ఆజ్ఞను మీరగూడదు?



ఆ) ఐకమత్యంవల్ల పావురాలు ఏం చేశాయి?

ఇ) చదివితే ఎటువంటి పద్యాన్ని చదవాలి?

ఈ) జీవితంలో వేటికి తట్టుకొని నిలబడాలి?

ఉ) జనులు తమ గొప్పలు చెప్పుకోవడం దేనికోసమని కవి చెప్పాడు?

## III. స్వీయరచన



### కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

అ) గురువుల ఆజ్ఞను ఎందుకు అతిక్రమించగూడదు?

ఆ) ఇతరుల మనసు నొప్పించేటట్లుగా మాట్లాడవద్దు అని ఉంది కదా! ఇతరుల పట్ల మీరెలా ప్రవర్తిస్తారు?

ఇ) ఐకమత్యంతో సాధించగలిగే పనులు ఏవి?

ఈ) కాని కార్యాలు అంటే ఏమిటి? అవి ఎందుకు చేయగూడదు.

ఉ) ఏ పనిలోనైనా విజయం సాధించాలంటే ఏం చేయాలి?

## IV. పదజాలం



### కింది పదాలు ఉపయోగిస్తూ, వాక్యాలను రాయండి. అవే పదాలకు పర్యాయపదాలు రాయండి.

**ఉదా:- భూమి, కార్యం     ధరిత్రి, ధరణి     పని, క్రియ**

భూమిని కాపాడుకోవడం మన తక్షణ కార్యం.

అ) వంశం, అపకీర్తి = ____________ ____________

ఆ) ఆరంభం, నిక్కం = ____________ ____________



ఇ) జగతి, యుద్ధం = ____________ ____________

ఈ) సుగుణములు, శత్రువు = ____________ ____________

ఉ) తప్పు, ఇల్లు = ____________ ____________

## V. సృజనాత్మకత



### కింది వాటిలో ఒకదాన్ని చేయండి.

అ) 'ఐకమత్యమే మహాబలం' అనే సూక్తికి సరిపోయే ఒక కథను సొంతంగా తయారుచేయండి.

ఆ) పద్యభావాలకు సరిపోయే కొన్ని నీతివాక్యాలు తయారుచేయండి.

## VI. ప్రశంస



### కిందివాటిలో ఒకదాన్ని చేయండి.

అ) పాఠంలోని నీతిని గ్రహించారుకదా! అలాగే ఇతర భాషలైన ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ మొ॥ భాషలలో ఉన్న నీతివాక్యాలను సేకరించి రాయండి.

ఆ) మీ తరగతిలో పద్యాలు బాగా పాడేవారిని ప్రశంసిస్తూ కొన్ని వాక్యాలు చెప్పండి.

## VII. భాషాంశాలు



### 1. కింది వాటిలో విభక్తులు గుర్తించండి.

ఉదా ॥ రాముడు అడవికి వెళ్ళాడు.



అ) విద్యను అర్థించేవాడు విద్యార్థి.

ఆ) రవి జ్వరంతో బాధపడుతున్నాడు.

ఇ) సీత కోసం అన్వేషణ జరిగింది.

ఈ) కమల కంటె విమల తెలివైనది.

ఉ) రాజు యొక్క ఆజ్ఞ.

ఊ) దేశము నందు భక్తి.

### 2. కింది వాక్యాన్ని గమనించండి.

'నా చిన్నప్పుడు పరుగులు తీసిన రోజులు గుర్తుకువచ్చాయి'.



©SCERT not to be republished

పై వాక్యంలో 'చిన్నప్పుడు' అనే పదం 'చిన్న+ అప్పుడు' అనే రెండు పదాల కలయిక వల్ల ఏర్పడింది. దీన్నే సంధిపదం అంటారు.

ఉచ్చారణ సౌలభ్యంకోసం రెండు పదాలను వెంటవెంటనే కలిపి మాట్లాడవలసి, రాయవలసి వచ్చినప్పుడు సంధిపదం ఏర్పడుతుంది.

రెండు తెలుగు పదాల మధ్య జరిగే సంధులను 'తెలుగు సంధులు' అంటారు.

వ్యాకరణ పరిభాషలో రెండు స్వరాల (అచ్చుల) కలయికను 'సంధి' అనీ, ఆ రెండు స్వరాల మధ్య జరిగే మార్పును 'సంధికార్యం' అని అంటారు. మొదటిపదం చివరి అక్షరాలోని స్వరాన్ని 'పూర్వస్వరం' అని, రెండో పదం మొదటి అక్షరంలోని స్వరాన్ని 'పరస్వరం' అనీ అంటారు..

ఉదా ॥ రామ + అయ్య 'మ' లోని 'అ' (పూర్వస్వరం) + అయ్యలోని 'అ' (పరస్వరం)

కింది పదాలను విడదీయండి.

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | ఉదా: మేనల్లుడు | = | మేన | + | అల్లుడు | = | (న్ +) అ | + అ | = | అ |
| అ) | ఒకప్పుడు | = | ..... | + | ....... | = | ....... | + ... | = | .... |
| ఆ) | వచ్చినందుకు | = | ..... | + | ....... | = | ....... | + ... | = | .... |
| | ఉదా: రాకుంటే | = | రాక | + | ఉంటే | = | (క్ +) అ | + ఉ | = | ఉ |
| ఇ) | చెప్పకున్న | = | ..... | + | ....... | = | ....... | + ... | = | .... |
| ఈ) | చేయకుంటే | = | ..... | + | ....... | = | ....... | + ... | = | .... |
| | ఉదా: లేకేమి | = | లేక | + | ఏమి | = | (క్ +) అ | + ఏ | = | ఏ |
| ఉ) | జరగకేమి | = | ..... | + | ....... | = | ....... | + ... | = | .... |
| ఊ) | పోవుటెట్లు | = | ..... | + | ....... | = | ....... | + ... | = | .... |

పై పదాలలో పూర్వస్వరం 'అ' పరస్వరంతో కలిసినప్పుడు 'అ' లోపించింది. పరస్వరం రూపం కనిపిస్తుంది. దీన్ని **'అత్వసంధి'** అంటారు. హ్రస్వ (పొట్టి) 'అ' అనే అక్షరానికి 'అచ్చు' పరమైనపుడు అత్వసంధి ఏర్పడుతుంది.

కింది పదాలను కలిపి రాయండి. అత్వసంధి ఏర్పడ్డ విధానాన్ని గమనించండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఉదా: | చాలిన | + | అంత | = | (న్ +) అ + అ = అ – చాలినంత |
| అ) | ఉన్న | + | అప్పుడు | = | |
| ఆ) | లేక | + | ఉంటే | = | |
| ఇ) | అందక | + | ఉంటే | = | |
| ఈ) | ఉండుట | + | ఎట్లు | = | |



## ప్రాజెక్టు పని

**1. పద్య భావాలకు సరిపోయే జాతీయాలను / సామెతలను సేకరించి ప్రదర్శించండి.**



## నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | పద్య భావాల గురించి సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | పద్యాలను చదివి, భావాలు గ్రహించగలను. | ఔను / కాదు |
| 3. | పద్య భావాలను సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | పద్య భావాల ఆధారంగా నీతి వాక్యాలు రాయగలను. | ఔను / కాదు |

*"కష్టాలకు తట్టుకొని నిలబడగలిగినవారే గౌరవం పొందుతారు."*

